వద్ద ఆమె ముఖకవళికలు విప్పారినవి. పెద్దగా నవ్వసాగింది. ఆ నవ్వులో ద్యోతకమౌతూన్న నామీది నీచభావం నన్నంతఃపాతాళానికి కృంగ దీసి నాకు పిచ్చెత్తించింది, ఏదో బ్రహ్మాండంగా ప్రేలుతున్నట్లున్నదా చులకనతో నిండిననవ్వు. ఆనవ్వువన్ను వెంటనే మోకరిల్లి ఆమె పాదాల్ని ముద్దెట్టుకుందామా అన్నట్లు చేసింది. ఆమె హేళన నామీద వజ్రనిపాతంగాపడి దగ్ధంచేసింది. ఆ క్షణంలో ఆమెతిరిగి ద్వారంవేపు నడచింది.

"నా విపరీత ప్రవర్తనకు సాకులుచెబుదామని ఆమెక్షమను వేడుకుందామని, కృంగిపోతున్న హృదయంతో అనాలోచితంగా వెంబడించాను. బైటికివెళ్ళేముందు నావేపు తిరిగింది, నాతో చెప్పడానికి—లేదు. ఆజ్ఞాపించడానికి.

"నన్ను వెంబడించడానిగ్గాని, నేనెవరో తెల్సుకోడానిక్కాని ప్రయత్నించవద్దు. ప్రయత్నించావా తర్వాత చింతిస్తావు."

మెరుపులాగా అదృశ్యమైంది.

(అనువాదం కె. యస్. శివరావు)

(తరువాయి వచ్చే సంచికలో)

---

స్కెచ్

# చదవండి

"హిత శ్రీ"

నగరంలో ఉన్నట్టుండి సంచలనం కలిగింది.

జరిగిన వింత ఏమంటే నడిబజారులో నాలుగు రోడ్లుకలిసే స్థలంలో ప్రకటనపత్రాలు అంటించటానికి ఉద్దేశించబడి ప్రత్యేకంగా నిర్మించబడిన ఒక గోడమీద పై భాగంలో పెద్ద పోస్టరు అంటించబడి ఉంది. రోడ్లమీది జన సమ్మర్దాన్ని అంతటినీ అరికట్టేలా జనం అక్కడ గుమిగూడి ఆ వింతని ఆశ్చర్యంగా చూడసాగారు. ఇంత మంది దృష్టిని ఆకర్షించిన ఆ పోస్టరులో ఏం విశేషం ఉందో అని జనాన్ని తోసుకుని కొత్తగా ఒచ్చే మరి కొంతమంది మనుషులు ఆ పోస్టరు చూసీచూడటంతోటే దిగ్భ్రాంతులై కొంత సేపటిదాకా తమకళ్ళని తామే నమ్మలేక పక్క వాళ్ళ ముఖాలని తనిఖీ చెయ్యసాగారు.

ఇందరి ఆశ్చర్యానికి కారణభూతమైన ఆ పోస్టరుతో మరేమీ భయానకమైన వృత్తాంతం గానీ, నమ్మలేని వార్తగానీ రాయబడి ఉండ లేదు ఆ తెల్లని సుదీర్ఘ చతురస్రాకారపు కాగితంమీద మూడంగుళాల వ్యాసంగల ఒక చుక్క ఎరుపురంగులో ప్రకాశిస్తోంది. అదే విశేషం. దీని భావమేమి తిరుమలేశ?

ఇదేదో తమాషాకోసం ఎవరోచేసినపని అని అక్కడచేరిన కొంతమంది పెద్దలు వ్యాఖ్యానించారు. ఇదిసబబుగానే ఉందని చాలామంది వెంటనే ఒప్పుకున్నారు. కొంతమంది కాస్సేపు తర్కించి ఏమీతోచక బహుశా అంతే అయి వుంటుందని తప్పని సరిగా మనసుని సరి పెట్టుకున్నారు.

ఆ సాయంత్రం క్లబ్బులో ఓ కొత్త విశేషం బయటపడింది. ఎవరో ఒకాయన చీట్లపేక ఆటలో మాటవరసగా అన్నాడు-తనకి ఆ రోజు ఓ తమాషా ఉత్తరం వొచ్చిందని. కవరు విప్పితే అందులో ఓ తెల్లకాగితం తప్ప ఏమీలేదుట. అయితే ఆ కాగితానికి మధ్యన ఓ చిన్న ఎర్ర చుక్క ఉందిట. దానిభావ మేమిటో తనకి తెలియలేదనీ, ఎవరో కుర్రాళ్లు తమాషాచేసి ఉంటారని అనుకుంటున్నాననీ అన్నాడు. అత నామాటలు ముగించేసరికి అంతా పాలిపోయిన ముఖాలతో ఒక విషయం బయటపెట్టారు. ఆ పెద్దమనిషి చెప్పిన విషయం తమకేమీ కొత్త సంగతి కాదుట-వాళ్లలో చాలామందికి అలాంటి ఉత్తరాలు వొచ్చాయిట. దీంతో క్లబ్బు క్లబ్బంతా మారు మోగిపోయింది. ఇదేదో అనర్థానికి చిహ్నం అయిఉంటుందని చాలామంది అభిప్రాయపడ్డారు.

మర్నాడు ఏమీ జరగలేదు. తరవాత రోజు కూడా ఏమీ జరగలేదు. ఈ సంగతి అప్పుడే చాలావరకు పాతబడిపోయింది. ఆ తరవాత రోజు నగరం జనసంఖ్యలో మూడోవంతు నడిబజారులోని కూడలిస్థానం తీర్థయాత్రలా దర్శించసాగారు. పూర్వపు పోస్టరుమీద మరో కాగితం అంటించబడి ఉంది. శుద్ధ తెల్లకాగితం. మధ్యన

మాత్రం ప్రశ్నార్థకం ఉంది. ఎర్రగా మెరుస్తూన్న ఆ ప్రశ్నార్థకం జనాన్ని చూసి సవాలుచేస్తూ గర్వంగా, రీవిగా ఆశ్చర్యాన్ని సరఫరాచేస్తోంది.

ఆరోజు మధ్యాహ్నమయేసరికి టౌన్‌పోలీస్ స్టేషన్‌లలో ఎప్పుడూ కనివిని ఎరగనటువంటి సందడిగా ఉండి. ఎన్నో కార్లు వొచ్చిపోతున్నాయి. ఎన్నో రిపోర్టులు దాఖలుచేయబడ్డాయి. అన్నీ ఒకే విషయానికి సంబంధించినటువంటివే. ఎక్కడినించో ఉత్తరాలు రావటం, ఆ ఉత్తరాల్లో ఒకసారి ఓ ఎర్రచుక్క. రెండోసారి ఓ ప్రశ్నార్థకం మాత్రం ఉండటం.

ప్రజానీకంలో అలజడికలిగింది. పోలీసువాళ్లు మాత్రం నవ్వేసి ఊరుకున్నారు. వాళ్లకిదేమీ అంత ముఖ్యవిషయం కానట్లుగా తోచింది. ప్రజలకి మాత్రం ఇదేమీ తమాషాకాదనీ, తమాషా కోసమే అయితే అంతడబ్బు ఎవరూ ఖర్చుపెట్టరనీ అనుకోసాగారు.

మరి రెండురోజుల్లో కొత్తవింత ఏమీ జరగలేదు. జనం మాత్రం ఇంకా ఏమో జరుగుతుందని అనుమానంతో ఓ కన్ను ఆ బోర్డుమీద వేసి వుంచారు. వాళ్ళ అనుమానం ఊరికేపోలేదు. ఈ సారి పోస్టరుమీద ఓ ఆశ్చర్యార్థకం వుంది. పూర్వంలాగే చాలామందికి ఈసారికూడా కవర్లు రావటం, అందులో ఎర్రగా ఆశ్చర్యార్థకం గుర్తులుండటం జరిగింది. దీంతో ప్రజల్లో భయం వ్యాపించింది. ఇదేదో "టెర్రరిస్టు" ఉద్యమం అయివుంటుందేమోననే అనుమానం పీడించ సాగినది. పేపర్లలో ఈ వింత ప్రచురితమైంది. పోలీసులు ఆచూకీ తీయటానికి ఉపక్రమించారనే వదంతి బయలుదేరింది. దాంతో కొంచెం శాంతి చెందారు జనం.

తరవాత రెండురోజులవరకూ ఏమీజరగలేదు. ఆ తరవాత రోజున మళ్ళీ ఇంకోపోస్టరు అంటించబడివుంది. ఈసారి పోస్టరులో అక్షరాలు కూడా ఉన్నాయి. పూర్వంలాగే కాగితం మధ్యలో "ఆగండి" అనే అక్షరాలూ, వాటి తరవాత పూర్వంలా ఎర్రటి చుక్క ఉన్నాయి.

ఈసారి విభ్రమంతోపాటు జనానికి పోలీసువారిమీద తీవ్రమైన కోపంకూడావచ్చింది. గస్తీ పోలీసు ఏంచేస్తున్నట్టు? కొంతమంది సాహసికులు సరాసరి పోలీస్‌స్టేషన్‌కి పోయి అడిగేశారు,


ఎడతెగని దగ్గు
ఇన్‌ఫ్లూయెంజా
శైత్యములకు
మీకు కావలసినది
పెప్స

పెప్స మంచిరుచిగల బిళ్ళలు, అవి మీ ఊపిరితో జబ్బుగల చోటికి ఔషధ సారములను పంపి శీఘ్రముంగాను అమోఘుంగాను పని చేయును. మీరు పెప్సను చప్పరించినప్పుడు విషనివారకమైన నాటి ఆవిర్లు, దగ్గును ఆపి, వాచిన పొరలను శమనపరచును. క్రిములను సంహరించి, వూపిరి ధారాళముగా ఆడునట్లు చేయును. రొమ్ముకు గొంతుకు వెంటనే శమనము గూర్చును



PEPS
విష నివారకమైన గొంతు, రొమ్ము, ఊపిరితిత్తుల జబ్బులకు అమోఘమైన చికిత్స

FPY-6.

ఇన్‌స్పెక్టరు ఓ చిన్నినవ్వు నవ్వేసి అనుభవజ్ఞుడిలా ఓ పోజువేసి సమాధానం చెప్పేశాడు.

"కాగితాలు అంటించే కుర్రాడిని పట్టుకుంటే అసలువాళ్లు ఎలాదొరుకుతారు? పట్టం తగలాలిసింది ఈపనికి మూలకారణం ఎవరో వాళ్ళకిగాని, డబ్బుకోసం ఈ కాగితాలు అంటించే వాళ్ళకి కాదు కొంచెం ఓపికపట్టటం అవసరం. ఎవరికీ వొచ్చిన భయమేమీలేదు." ఈ సమాధానంతో అభయహస్తంతో తృప్తిపడక తప్పదు కనుక వొచ్చినదారినే వెళ్ళిపోయారు స్వచ్ఛందరాయబారవర్గసభ్యులు.

వార్తా పత్రికలలో ఎప్పటికప్పుడు ఈ విషయాలు ప్రకటిక మవుతూనే ఉన్నాయి. ఈ కాగితాలు అందుకుంటున్న అవకాశం లభించిన వారికిమాత్రం మనశ్శాంతి బొత్తిగా దూరమయిపోతోంది.

మరో రెండురోజుల తరవాత ఇంకో పోస్టరు వంతువచ్చింది. ఈసారికూడా అక్షరాలున్నాయి. కాగితం మధ్యన "ఏమిటి మీరు చెయ్యబోతున్న పని?" అని అక్షరాలూ, చివరప్రశ్నార్థకంఉన్నాయి.

మామూలు జనంసంగతి అలాఉంచి ఈ కాగితాలు అందుకున్నవారికి ఈసారి పై ప్రాణాలు పైనే పోయాయి, ఇదేదో దౌర్జన్యచిహ్నం అని తోచింది వాళ్ళలో చాలామందికి. ఏదో గూఢచారులసంస్థ పనిచేస్తోందనీ, అందులోని సభ్యులు తమచుట్టూ గూఢంగా తిరుగుతున్నారనీ, తాము చేస్తున్న ప్రతిపనీ గమనిస్తున్నారనీ, తమ రహస్యాలు రహస్యాలుగా ఉండటంలేదనీ భయం కలిగింది. బహుశా తమచుట్టూ తిరుగుతున్నా తమకిబాగా పరిచయంఉన్న వ్యక్తులే ఈ పనికి ఒడిగట్టి ఉండవచ్చు అని కూడా అనుమానించసాగారు. ఏదో విప్లవం రాబోతోందనీ, ఈ సాంకేతిక భాష ఏదో కీడు సూచిస్తోందనీ గట్టిగా నమ్మసాగారు. దీనికితోడు ఇన్‌స్పెక్టర్‌ని సలహా అడిగితే "మీరేమైనా చెడుపనులు చెయ్యబోతున్నారా?" అని ముఖాన అడిగేవాడు. "లేదు" అని చెబితే "అయితే భయం ఎందుకు?" అన్నాడు. ఏం చెప్పటానికీ వాళ్ళకి తోచలేదు. ఓ సత్ఫలితంమాత్రం కలిగింది. కొంతవరకు యుక్తాయుక్తాలు ఆలోచించి కేవలం స్వార్థపూరితమైన కొన్ని పనులు వెంటనే కొంతమంది కట్టిపెట్టటం జరిగింది. ఎంచేతంటే కొన్ని ప్రకటించ బడిన ఫ్యాక్టరీలాకౌట్‌లూ, శ్రామికుల బర్తరఫుల్లాంటివీ, కొన్ని చిన్నచిన్న పేచీలూ ఉపసంహరిపచుకోబడ్డాయి.

కొంతమంది ఇది కేవలం 'ఓష్టంట్' అనీ దీన్ని ఖాతరు చెయ్యాలిసిన అవసరం ఏమీ లేదనీ. నిర్లక్ష్యం చేశారు. మరికొంతమంది ఇది ఏదో పార్టీప్రచారంకోసం వేసిన పాచిక అన్నారు. కాని ఎర్రగాఉన్న ఆ అక్షరాలని చూసి లోలోపల భయపడనివాళ్లు ఎవరూ లేరు. ఏ రష్యా చైనాలలాగానో ప్రజావిప్లవం లేవదియ్యటానికిదో ప్రయత్నమయి ఉంటుందేమోనని కొంతమంది భయభ్రాంతులు శంకించసాగారు. దీనికితోడుగా మరో విశేషం జరిగింది. మరికొన్ని ముఖ్యపట్టణాల్లో ఇలాంటి పోస్టర్లు అంటించబడ్డాయని వార్తాపత్రికలు ప్రకటించాయి. ప్రతి పోస్టరుమీదా ఎర్రసిరాలో "ఆగండి. ఏమిటి మీరు చెయ్యబోతున్న పని?" అని రాసివుంది. దీంతో భారతావనిలో అధిక సంచనం కలిగింది, కేవలం స్థానికం అనుకున్న ఈ 'విశేషం' యావద్భారతం వ్యాపించటంచూసి ఇదేదో తప్పక విప్లవఉద్యమం అని అంతా రూఢిచేసుకొన్నారు. పోలీసు దళాలు చాలా చురుకుగా పనిచేయసాగాయి. కమ్యూనిస్టుల అరెస్టులు దేశం మొత్తంమీద జరిగాయి. ఎర్రసిరా ఇంట్లో ఉంచుకోటానికి చాలామంది (కుర్రాళ్ళుసయితం) భయపడ సాగారు. అసెంబ్లీలో, పార్లమెంటులో ప్రశ్నల వర్షం కురవసాగింది.

అందరికీ భరింపరాని కుతూహలం ప్రబలింది. ఓ వారంరోజుల వరకూ ఎటువంటి విశేషమూ జరగలేదు. చెడోమంచో ఏదో తేలిపోతే మంచిదని మనసులో "సస్పెన్స్" బాధని భరించలేక ప్రతివారూ భవిష్యత్తులో జరగబోయే విశేషం కోసం ప్రతి నిమిషం ఎదురు చూడసాగారు.

మరో రెండురోజుల తరవాత నడిబజారులోని కూడలి స్థానంలో నిర్మించబడిన ప్రత్యేకమైన కుడ్యంమీద ఓ పెద్దపోస్టరు అంటించబడి ఉంది. ఇలాంటివే మరికొన్ని పట్టణాల్లోకూడా పోస్టర్లు అంటించబడ్డాయి అని తరవాత తెలిసింది. పోస్టర్‌లో ఏం ఉందోనని ప్రతివాడూ ఆతృతగా కుతూహలంతో దృష్టిని ఆ కాగితంమీదికి సారించాడు—ఎర్రని అక్షరాల వైపు. ఆ పోస్టర్‌లో మాటలీవిధంగా ఉన్నాయి.

ఆగండి.

ఏమిటి మీరు చెయ్యబోయేపని?

దుబారా!

డబ్బును దాచుకొనుడు. దుర్వినియోగ పరచవద్దు.

వివరములకు : ది అసోసియేటెడ్ బ్యాంకింగ్ కంపెనీస్ ఆఫ్ ఇండియా లిమిటెడ్.

(పబ్లిసిటీరిసెర్చిశాఖ ప్రకటన.)